క్లుప్తంగా

వలంటీర్ల ఎంపికకు దరఖాస్తులు ఆహ్వానం

ఫిరంగిపురం: మండలంలోని రెండు గ్రామాల్లో వలంటీర్ల ఎంపికకు అర్హులైన నిరుద్యోగ యువతీయువకులు దరఖాస్తు చేసుకోవాలని ఎంపీడీఓ డి.అనూరాధ గురువారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. గుండాలపాడు -1 షెడ్యూలు కులం, పొనుగుపాడు-1 షెడ్యూలు తెగలుకు చెందిన నిరుద్యోగ యువతీయువకులు ఈనెల 26లోగా దరఖాస్తు చేసుకోవాలని చెప్పారు. 22.3.2023 నాటికి 18 నుండి 35 ఏళ్ల దాటని వారు, పదో తరగతి తత్సమాన పరీక్ష పాసై ఉండాలన్నారు. వెబ్‌సైట్‌లో ఆధార్ కార్డు, విద్యార్హతలు, కుల, నివాస ధ్రువీకరణలతో ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేయాలని చెప్పారు. 28న దరఖాస్తు పరిశీలన, 29న మౌఖిక పరీక్ష, 31న ఎంపిక వివరాలు తెలియజేస్తామని తెలిపారు.

నిరుపేదలకు దుప్పట్లు పంపిణీ



మంగళగిరి: కార్పొరేషన్ పరిధిలోని ఆత్మకూరు కాలువ పక్క నివసిస్తున్న పలువురు నిరుపేదలకు గురువారం వైవీజే ట్రస్ట్ చైర్మన్ వై జీవన్ ఆధ్వర్యంలో దుప్పట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ట్రస్ట్ ప్రతినిధులు కె రూఫస్, ఎం జవహర్, ఎం రాజారావు, వై హనోక్, బి సమాయేలు తదితరులు పాల్గొన్నారు.

పూల మార్కెట్లో తనిఖీలు



నెహ్రూనగర్: వ్యాపారస్తులు తప్పనిసరిగా లీగల్ మెట్రాలజీ శాఖ ద్వారా స్టాంపింగ్ వేయించుకున్న తర్వాతే తూకాల్ని వాడాలని ఆ శాఖ డెప్యూటీ కంట్రోలర్ షాలేం రాజు తెలిపారు. స్టాంపింగ్ వేయించకుండా వ్యాపారం చేసే వారిపై శాఖాపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. వరలక్ష్మి వ్రతం సందర్భంగా వినియోగదారులు ఎక్కువగా పూలు కొంటున్న నేపథ్యంలో గురువారం మార్కెట్లో తనిఖీ నిర్వహించారు. స్టాంపింగ్ నిబంధన పాటించని ఐదుగురు వ్యాపారస్తులపై కేసులు నమోదు చేసినట్లు ఆయన పేర్కొన్నారు.

ఎన్‌సీసీ విద్యార్థులకు సర్టిఫికెట్ల ప్రదానం



గుంటూరు ఎడ్యుకేషన్: ఎన్‌సీసీ 25 ఆంధ్ర బెటాలియన్‌లో శిక్షణ పూర్తి చేసుకున్న శ్రీపాటిబండ్ల సీతారామయ్య సీబీఎస్‌ఈ పాఠశాల విద్యార్థులకు సుబేదార్ మేజర్ మోహిత్, హవల్దార్ కృష్ణ మనోహర్ ఎన్‌సీసీ-ఏ సర్టిఫికెట్లు ప్రదానం చేశారు. లక్ష్మీపురం మెయిన్ రోడ్డులోని పాఠశాలలో గురువారం జరిగిన కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్ పాటిబండ్ల విష్ణువర్ధన్ మాట్లాడారు. విద్యార్థి దశ నుంచే క్రమశిక్షణ, దేశభక్తి అలవర్చుకోవడంలో ఎన్‌సీసీ శిక్షణ దోహదం చేస్తుందని తెలిపారు. ఎన్‌సీసీ శిక్షణ పొందడం ద్వారా భావి జీవితంలో కుటుంబపరంగా, వృత్తిపరంగా ఎటువంటి పరిస్థితులనైనా ఎదుర్కొనే మానసిక, శారీరక దృఢత్వాన్ని, శక్తిని విద్యార్థులకు లభిస్తుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో పాఠశాల కమిటీ గౌరవాధ్యక్షుడు డాక్టర్ యలమంచిలి శివాజీ, పాలకవర్గ సభ్యుడు గింజుపల్లి వరప్రసాదరావు, డైరెక్టర్ లేళ్ల కృష్ణవేణి, ప్రిన్సిపాల్ జె. పద్మజ, వైస్ ప్రిన్సిపాల్ తేజస్విని, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పారిశుద్ధ్య పనులు పక్కాగా జరగాలి

నెహ్రూనగర్: నగరంలో వ్యర్థాల సేకరణ ప్రణాళికాబద్ధంగా జరగాలని కమిషనర్ కీర్తి చేకూరి ఆదేశించారు. పారిశుద్ధ్య నిర్వహణపై ప్రజల నుంచి అనేక ఫిర్యాదులు అందుతున్నాయని, నిర్లక్ష్యంగా ఉండే అధికారులు, సచివాలయ కార్యదర్శులపై కఠిన చర్యలు తప్పవని ఆమె హెచ్చరించారు. నగరపాలక సంస్థ కౌన్సిల్ సమావేశ మందిరంలో గురువారం ప్రజారోగ్య, ఇంజినీరింగ్, హౌసింగ్ అధికారులతో పారిశుద్ధ్యం, ఈ-ఆటోల నిర్వహణ, వినియోగం, గడపగడపకు మన ప్రభుత్వం పనుల పురోగతి, జగనన్న లే- అవుట్స్‌లో ఇళ్ల నిర్మాణ పనులు తదితర అంశాలపై ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ నగరంలో పారిశుద్ధ్య పనులు పక్కాగా జరగాలని చెప్పారు. ఇంటింటి చెత్త సేకరణకు ఈ-ఆటోల్ని కేటాయించినా కొన్ని ప్రాంతాల్లో పారిశుద్ధ్య పనులు మెరుగ్గా జరగడం లేదని, ప్రధాన రోడ్ల వెంబడి వ్యర్థాలు కుప్పలు ఉంటున్నాయని తెలిపారు. ఈ-ఆటోలను కేవలం ఇంటింటి చెత్త సేకరణకు మాత్రమే వినియోగించాలని, ఇతర వాటికి వినియోగిస్తే సంబంధిత శానిటేషన్ కార్యదర్శి, ఇన్‌స్పెక్టర్లపై కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. నగరంలో ఇక నుంచి ఉదయం 6 గంటల నుంచే చెత్త సేకరణ ప్రారంభించాలని ఆదేశించారు. గ్యాంగ్ వర్క్ సమయంలో స్థానిక కార్పొరేటర్లతో సమన్వయం చేసుకోవాలని, గార్బేజ్ ట్రాన్స్‌ఫర్ స్టేషన్ల వద్ద ప్రత్యేకంగా సిబ్బందిని కేటాయించాలని సూచించారు. ఆటోల డ్రైవింగ్‌పై కార్మికులకు శిక్షణ ఇవ్వాలని తెలిపారు.

గడువులోగా సర్వే చేపట్టి ప్రజా మన్ననలు పొందాలి

- ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి (ఆర్కే)
- ఎమ్మెల్సీ మురుగుడుతో కలసి సచివాలయ సర్వేయర్లతో సమీక్షా సమావేశం



మాట్లాడుతున్న ఎమ్మెల్యే ఆర్కే, ఎమ్మెల్సీ మురుగుడు, తహసీల్దార్లు జీవీ రామ్‌ప్రసాద్, నాగిరెడ్డి

మంగళగిరి: నిర్ణీత గడువులోగా భూ సర్వే చేపట్టి ప్రజా మన్ననలను పొందాలని ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి (ఆర్కే) అన్నారు. నగరంలోని కార్పొరేషన్ కార్యాలయంలోని సమావేశ మందిరంలో గురువారం ఎమ్మెల్సీ మురుగుడు హనుమంతరావుతో కలసి కార్పొరేషన్ పరిధిలోని సచివాలయాల సర్వేయర్లు, పట్టణ ప్రణాళికా విభాగం అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఎమ్మెల్యే ఆర్కే మాట్లాడుతూ మంగళగిరి-తాడేపల్లి కార్పొరేషన్ పరిధిలో సామాన్య ప్రజలు, రైతులు దరఖాస్తు చేసుకున్న సర్వే అర్జీలు పెండింగ్‌లో ఉండటంతో ఇబ్బందులు పడుతున్నట్లు గుర్తించామన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా సర్వే జరుగుతున్న నేపథ్యంలో అర్బన్ పరిధిలో సర్వేయర్ పోస్టు ఖాళీగా ఉండటంతో సుమారు 200కు పైగా దరఖాస్తులు పెండింగ్‌లో ఉన్నాయని, దీనిపై కమిషనర్ ల్యాండ్ సర్వే సిద్ధార్థజైన్‌ను కలిసి సర్వేయర్‌ను నియమించాలని కోరినట్లు తెలిపారు. వెంటనే స్పందించిన ఆయన బాపట్ల నుంచి మండల సర్వేయర్‌ను కేటాయించారని తెలిపారు. పెండింగ్‌లో ఉన్న దరఖాస్తులను సెప్టెంబరు ఐదో తేదీ నాటికి పరిష్కరించేందుకు ప్రణాళికలు సిద్ధం చేసుకుని దానికి అనుగుణంగా అధికారులు విధులు నిర్వహించాలని సూచించారు. ఇకపై సర్వే కోసం దరఖాస్తు చేసుకున్న ప్రజలకు, రైతులకు ఎటువంటి ఇబ్బందులు కలుగకుండా నిర్ణీత గడువులోగా పరిశీలించి సర్వే సర్టిఫికెట్లు అందేలా పట్టణ ప్రణాళికా విభాగం, రెవెన్యూ అధికారులు సమన్వయంతో పని చేయాలన్నారు. సర్వే కోసం దరఖాస్తుదారుల వద్ద నుంచి ఎటువంటి లంచాలు ఆశించకుండా బాధ్యతగా సర్వే చేపట్టి సర్టిఫికెట్లను సకాలంలో అందజేసి మన్ననలను పొందాలన్నారు. సమావేశంలో మంగళగిరి, తాడేపల్లి తహసీల్దార్లు జీవీ రామ్‌ప్రసాద్, నాగిరెడ్డి, ఏసీపీ వెంకటేశ్వర్లు, మండల సర్వేయర్ హనుమంతరావు పాల్గొన్నారు.

ఉర్దూ పాఠశాలను పరిశీలించిన ఎమ్మెల్యే ఆర్కే

తాడేపల్లిరూరల్: దుగ్గిరాల మండలంలోని రేవేంద్రపాడులో ఉన్న ఉర్దూ పాఠశాలను ఎమ్మెల్యే ఆర్కే స్థానిక ముస్లిం సోదరులతో కలసి గురువారం పరిశీలించారు. ఎనిమిదేళ్ల కిందట గత ప్రభుత్వం మండల పరిషత్ ఉర్దూ పాఠశాలను విద్యార్థులు లేరనే సాకుతో మూసివేశారు. పాఠశాల భవనం పూర్తిగా దెబ్బతింది. స్థానికంగా ఉన్న ముస్లిం సోదరులు రేవేంద్రపాడులో ఉన్న ఉర్దూ పాఠశాలను తెరిపించి పునః ప్రారంభించాలని కోరడంతో ఎమ్మెల్యే ఆర్కే పరిశీలన కార్యక్రమం నిర్వహించారు. ఎమ్మెల్యే ఆర్కే మాట్లాడుతూ రేవేంద్రపాడులోని ఉర్దూ పాఠశాలను పునః ప్రారంభించేందుకు విధి విధానాలపై ఉన్నతాధికారులతో చర్చించి కొత్త భవనాన్ని నిర్మించి ఉర్దూ పాఠశాలకు పూర్వ వైభవం తీసుకువచ్చేలా చేస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో రేవేంద్రపాడు సర్పంచ్ పణుకూరి మేరీ రాణి, ముస్లింపెద్దలు, తదితరులు పాల్గొన్నారు.

ఇప్పటంలో విగ్రహ ప్రతిష్ట మహోత్సవం

- ముఖ్య అతిథులుగా హాజరైన ఎమ్మెల్యే ఆర్కే, ఎమ్మెల్సీ మురుగుడు
- ప్రత్యేక పూజలు నిర్వహించిన అర్చకులు



ఎమ్మెల్యే ఆర్కే, ఎమ్మెల్సీ మురుగుడులకు రాముల వారి ప్రతిమను అందజేస్తున్న కమిటీ సభ్యులు

తాడేపల్లిరూరల్: తాడేపల్లి రూరల్ పరిధిలోని ఇప్పటంలో రోడ్డు విస్తరణ పనుల్లో భాగంగా శ్రీ హనుమత్ లక్ష్మణ సమేత సీతారామస్వామి వార్ల దేవాలయాన్ని స్వచ్ఛందంగా తొలగించి దాతల సహాయంతో దేవస్థానాన్ని నిర్మాణం చేసి గురువారం కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవాన్ని అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి, ఎమ్మెల్సీ మురుగుడు హనుమంతరావులు విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవంలో పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఎమ్మెల్యే ఆర్కే మాట్లాడుతూ అభివృద్ధి పనుల్లో భాగంగా హనుమత్ లక్ష్మణ సమేత సీతారామస్వామి వార్ల దేవాలయం తొలగించాల్సి వచ్చిందని, అధికారులు కమిటీ సభ్యులతో చర్చలు నిర్వహించగా స్వచ్ఛందంగా విగ్రహాలను తొలగించి దేవాలయాన్ని స్థాపితం చేశారని, గుడి నిర్మాణం కోసం తాడేపల్లికి చెందిన మున్నంగి సాంబిరెడ్డి, వెంకాయమ్మ దంపతులు స్థలాన్ని దేవాలయానికి రాసి ఇచ్చారని, ఇప్పటంలోని గ్రామ ప్రజల సహకారంతో ఒక సంవత్సరం లోపే నిర్మాణ పనులు పూర్తిచేసి విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవాన్ని నిర్వహించారని అన్నారు. ఇలాంటి మంచి కార్యక్రమానికి రావడం చాలా ఆనందించదగ్గ విషయమని అన్నారు. అనంతరం కమిటీ వారు విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవ సందర్భంగా అన్న సమారాధన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ రూరల్ జేసీఎస్ కన్వీనర్ మున్నంగి వివేకానందరెడ్డి, బ్రహ్మారెడ్డి, లచ్చి తులసీదాస్ గౌడ్, హరిబాబు గౌడ్, కమిటీ సభ్యులు, గ్రామస్తులు, ఇతర ప్రాంతాల నుంచి వచ్చి భక్తులు పాల్గొని స్వామివారికి దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు.

నాలుగు గ్రామాల్లో ఆధార్ సేవలు



ఫిరంగిపురం: మండలంలోని నాలుగు గ్రామాల్లో సచివాలయాల వద్ద రెండురోజులుగా ఆధార్ కేంద్రాలు ఏర్పాటుచేసి ప్రజలకు సేవలు అందజేస్తున్నట్లు ఎంపీడీఓ డి.అనూరాధ గురువారం తెలిపారు. ఇప్పటివరకు తక్కెళ్లపాడు, మేరికపూడి, నుదురుపాడు, రేపూడి గ్రామాల్లో శిక్షణ పొందిన డిజిటల్ అసిస్టెంట్లు గణేష్‌భార్గవ్, కె.అరుణలు సేవలు అందిస్తున్నారన్నారు. ఆధార్‌తో మొబైల్‌నెంబర్ లింకు, బయోమెట్రిక్ అప్‌డేట్, పదేళ్లకోసారి ఆధార్‌లో డాక్యుమెంట్ అప్‌డేట్, ఆధార్‌లో పేరుమార్పులు, జన్మదిన తేదీ మార్పులు వంటివి 90 మందికి సేవలు అందించినట్లు తెలిపారు. శుక్రవారం కూడా రేపూడి, నుదురుపాడు సచివాలయాల వద్ద ఆధార్ సేవలు అందుబాటులో ఉంటాయని ప్రజలు వినియోగించుకోవాలని కోరారు.

కిట్స్ అందజేత



తాడేపల్లిరూరల్: నగర పాలక సంస్థ పరిధిలోని పోలకంపాడు ఎఎంపీపీ స్కూల్‌లోని దివ్యాంగ విద్యార్థులకు తాడేపల్లి ఎంఈఓలు శాంతకుమారి, నాగేశ్వరరావులు సమగ్ర శిక్షణ ద్వారా వచ్చి ఐడీ కిట్లు గురువారం అందజేశారు. వారు మాట్లాడుతూ చిన్నారుల విద్యాభివృద్ధికి తోడ్పడాలని తల్లిదండ్రులకు సూచించారు. బుద్ధిమాంద్యం గల పిల్లల్లో ఒక ప్రత్యేకత ఉంటుందని, దానిని మనం తెలుసుకుని వాటిలో ప్రావీణ్యత పొందేలా శిక్షణ ఇవ్వాలని సూచించారు. కార్యక్రమంలో విద్యార్థుల తల్లిదండ్రులు, ఎంపీపీ స్కూల్ ప్రధానోపాధ్యాయులు శివరామకృష్ణ, భవిత సెంటర్ ఉపాధ్యాయులు, సహిత విద్యా ఉపాధ్యాయులు బి.హరికృష్ణ, వి.సునీతకుమారి పాల్గొన్నారు.

బీజేపీ ఆధ్వర్యంలో ఓటరు చేతన మహాభియాన్

మంగళగిరి: భారతీయ జనతా పార్టీ ఆధ్వర్యంలో గురువారం నగరంలోని పాత మంగళగిరి భావనారుషి కల్యాణ మండపంలో ఓటరు చేతన మహాభియాన్ కార్యక్రమం నిర్వహించారు. జిల్లా బీజేపీ అధ్యక్షుడు పాటిబండ్ల రామకృష్ణ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో ఓటర్లను చైతన్యపరిచే దిశగా 18 సంవత్సరాలు నిండిన వారికి ఓటు హక్కు కల్పించడం, ఆయా వార్డుల్లో లేని వారిని, మరణించిన వారిని ఓటర్ల జాబితా నుంచి తొలగించడం గురించి వివరించారు. చంద్రయాన్-3 విజయవంతమైన సందర్భంగా ఇస్రో శాస్త్రవేత్తలకు అభినందనలు తెలుపుతూ జాతీయ జెండా ప్రదర్శనతో ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు బిట్రా వెంకట శివన్నారాయణ, మకుటం శివ, జగ్గారపు శ్రీనివాసరావు, పంచుమర్తి చిన్న, భీమినేని చంద్రశేఖర్, చరక కుమార్‌గౌడ్, రాచమల్లు భాస్కర్, గారపాటి పూర్ణ, అప్పికట్ల రంగా, తులిమిల్లి రామకృష్ణ, మైలా హరికృష్ణ, దేవా రవి, దారా అంబేద్కర్, కాండ్రు భానుకిషోర్, కొతరపు ధనుంజయ, కొక్కిరాల యశోదకృష్ణ పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఆటో డ్రైవర్ మృతి



ప్రమాదంలో నుజ్జునుజ్జయిన ఆటో వద్ద శివయ్య మృతదేహం

మంగళగిరి: మంగళగిరి మండలం కృష్ణాయపాలెం వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో ఆటో డ్రైవర్ అక్కడికక్కడే దుర్మరణం చెందాడు. మంగళగిరి రూరల్ పోలీసులు తెలిపిన వివరాల మేరకు... కార్పొరేషన్ పరిధిలోని యర్రబాలెం ఎస్టీ కాలనీకి చెందిన కొజ్జా సాంబయ్య-చిన్నోడమ్మ దంపతుల కుమారుడు శివయ్య (37) ఆటో నడుపుకుంటూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. ఈ నేపథ్యంలో గురువారం ఆపిల్ పండ్ల లోడుతో ఆటో తీసుకుని శివయ్య మందడం బయలుదేరాడు. మార్గంమధ్యలోని మంగళగిరి మండలం కృష్ణాయపాలెం వద్ద ఎదురుగా వస్తున్న మరో గుర్తు తెలియని వాహనాన్ని తప్పించబోయి రోడ్డు పక్కనే ఉన్న ఇనుప బోర్డును ఢీకొట్టాడు. ప్రమాదంతో శివయ్య తలకు తీవ్ర గాయాలై అక్కడికక్కడే మృతి చెందాడు. సమాచారం అందుకున్న మంగళగిరి రూరల్ పోలీసులు హుటాహుటీన సంఘటనా ప్రాంతానికి చేరుకుని ప్రమాదం జరిగిన తీరును పరిశీలించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం చినకాకాని ఎన్నారై వైద్యశాలకు తరలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మృతుడికి భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు.



కొజ్జా శివయ్య (ఫైల్)

కేఎల్‌యూను సందర్శించిన అమెరికా యూనివర్సిటీ డైరెక్టర్



ప్రసంగిస్తున్న అమెరికా ఇనిస్టిట్యూట్ ఆన్ కమ్యూనిటీ ఇంటిగ్రేషన్‌లో రీసెర్చ్ డైరెక్టర్ డాక్టర్ రెనెటా టిచా

తాడేపల్లిరూరల్: అమెరికాలోని ఇనిస్టిట్యూట్ ఆన్ కమ్యూనిటీ ఇంటిగ్రేషన్‌లో రీసెర్చ్ డైరెక్టర్‌గా పనిచేస్తున్న డాక్టర్ రెనెటా టిచా వడ్డేశ్వరంలో కేఎల్ విశ్వవిద్యాలయాన్ని గురువారం సందర్శించారు. ఆమె కమ్యూనిటీ ఇంట్రిగేషన్, అసిస్టెవ్ టెక్నాలజీ అనే అంశంపై విద్యార్థులనుద్దేశించి ప్రసంగించారు. అనంతరం సాంకేతిక విద్యలో కమ్యూనిటీ ఇంటిగ్రేషన్, జీవన నాణ్యతను మెరుగుపరచడానికి సాంకేతికతను ఉపయోగించడం అనే అంశంపై ఆమె అధ్యాపకులను ఉద్దేశించి ప్రసంగించారు. కేఎల్‌యూ వైస్ చాన్సలర్ డాక్టర్ జి.పార్థసారథివర్మ మాట్లాడుతూ విద్యార్థులు, అధ్యాపకులు మిన్నెసోటా విశ్వవిద్యాలయం వంటి నాణ్యమైన విద్యా సంస్థలతో చేయి కలిపి పనిచేయడం వలన పరిశోధనా రంగంలో అభివృద్ధి చెందవచ్చని అన్నారు. అంతర్జాతీయ పౌర సంబంధాల డైరెక్టర్ ఎం.హెచ్.ఎస్. డీన్ డాక్టర్ ఎం.కిషోర్‌బాబు మాట్లాడుతూ డాక్టర్ రెనెటా సందర్శన విద్యార్థులకు, అధ్యాపకులకు కొత్త అవకాశాలను కలిగించినట్లు భావిస్తున్నామన్నారు. అంతర్జాతీయ పౌర సంబంధాల కార్యాలయ డిప్యూటీ డైరెక్టర్ డాక్టర్ జయ ప్రకాష్ కార్యక్రమాన్ని సమన్వయం చేశారు. కార్యక్రమంలో విశ్వవిద్యాలయం వైస్ చాన్సలర్ డాక్టర్ జి.పార్థసారథి వర్మ, ప్రొ వైస్ చాన్సలర్లు డాక్టర్ ఏవీఎస్ ప్రసాద్, డాక్టర్ ఎన్. వెంకట్‌రామ్, రిజిస్ట్రార్ డాక్టర్ కె.సుబ్బారావు పాల్గొన్నారు.

వాకర్స్ ఆధర్యంలో చంద్రయాన్ -3 విజయోత్సవం



చంద్రయాన్-3 విజయోత్సవంలో పాల్గొన్న వాకర్స్ అసోసియేషన్ సభ్యులు

మంగళగిరి: మంగళగిరి వాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో గురువారం నగరంలోని ఎకోపార్క్ ఆవరణలో చంద్రయాన్-3 విజయోత్సవ కార్యక్రమం నిర్వహించారు. భారత మాజీ సైనికుడు, ది మంగళగిరి వాకర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు తమ్మినేని మోహనరావు ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో పలువురు అసోసియేషన్ సభ్యులు పాల్గొని జాతీయ జెండాను చేతబూని భారత మాతాకు జై అంటూ నినాదాలు చేశారు. కార్యక్రమంలో అసోసియేషన్ అధ్యక్షుడు పుప్పాల కోటేశ్వరరావు, ఉపాధ్యక్షుడు పెద్దిరాజు, కార్యదర్శి వీసం వెంకటేశ్వరరావు, కోశాధికారి గోలి బాల మోహన్ పాల్గొన్నారు.

కాలువలో పడి వృద్ధుడి మృతి

గుంటూరు ఈస్ట్: కాలువలో పడి వృద్ధుడు మృతి చెందిన ఘటనపై నగరంపాలెం పోలీసులు కేసు నమోదు చేశారు. నగరంపాలెంలోని ఆంథోని చర్చి వెనుక మునగాల రంగారావు (75) మిషన్ కుట్టు కుంటూ జీవనం సాగిస్తున్నాడు. కొద్దిరోజులుగా అనారోగ్యంతో బాధపడుతున్నాడు. గురువారం తన షాపు సమీపంలోని మురుగు కాలువలో పడి మృతి చెంది ఉన్నాడు. స్థానికులు ఆలస్యంగా గుర్తించారు. రంగారావుకు బంధువులు ఎవరూ లేరని తెలిసింది. 81వ సచివాలయం వార్డు వలంటీర్ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

యోగాతో సంపూర్ణ ఆరోగ్యం

గుంటూరు ఎడ్యుకేషన్: యోగాతో సంపూర్ణ ఆరోగ్యం సాధ్యమని శ్రీ వేంకటేశ్వర బాలకుటీర్ వ్యవస్థాపకురాలు డాక్టర్ ఎన్. మంగాదేవి పేర్కొన్నారు. ఆంధ్రప్రదేశ్ యోగా స్పోర్ట్స్ అసోసియేషన్ అనుబంధంగా గుంటూరు జిల్లా యోగాసన స్పోర్ట్స్ అసోసియేషన్ ఇటీవల జిల్లాస్థాయిలో నిర్వహించిన యోగా పోటీల్లో బాలకుటీర్, చౌడవరం చేతన విద్యార్థులు అత్యుత్తమ ప్రతిభ చూపినట్లు పేర్కొన్నారు. అండర్-16 విభాగంలో జి. వినయ్ సాయిరాం, టి. కాశీ యశ్వంత్ ప్రథమ, ద్వితీయస్థానాల్లో, కె. హర్షవర్ధన్, ఎం. లాలా దుర్గాప్రసాద్ 4వ, 5వ స్థానాల్లో నిలిచారని వివరించారు. అండర్-10 విభాగంలో ఎస్.ప్రవల్లిక సలోమి ద్వితీయ స్థానంలో నిలిచిందని తెలిపారు. జిల్లాస్థాయి పోటీల్లో విజేతలుగా నిలిచిన విద్యార్థులు రాష్ట్రస్థాయిలో జరగనున్న యోగా పోటీలకు ఎంపికైనట్లు వివరించారు. యోగాను దినచర్యలో భాగంగా చేసుకుంటే సంపూర్ణ ఆరోగ్యవంతులుగా ఉంటారని తెలిపారు. శ్యామలానగర్ బాలకుటీర్‌లో గురువారం జరిగిన కార్యక్రమంలో విద్యార్థుల్ని సీవో దుర్గా రఘురామ్, చేతన నిర్వాహకురాలు మరుద్వతి, ప్రిన్సిపాల్స్ మల్లికార్జునరావు, వెంకటేశ్వరరావు, ఎండీ నస్రీన్, లక్ష్మీ ప్రసన్న, ఉపాధ్యాయులు అభినందించారు.

ఇన్‌స్టా గ్రామ్‌లో పరిచయం

- ప్రేమించుకున్న తాడేపల్లి అమ్మాయి, హైదరాబాద్ అబ్బాయి
- మరొకరి ప్రేమ వ్యవహారంలో సహాయ సహకారాలు
- కనిపించకుండా పోయిన యువతి
- తాడేపల్లి పోలీస్‌స్టేషన్‌కు చేరిన పంచాయితీ



ఇన్‌స్టా గ్రామ్‌లో ప్రేమించుకున్న భవాని, సతీష్



కనిపించకుండా వెళ్లిపోయిన బషీరున్నీసా, తీసుకెళ్లాడని అనుమానం వ్యక్తం చేస్తున్న శ్రీకాంత్ (ఫైల్ ఫొటో)

తాడేపల్లిరూరల్: తాడేపల్లి పట్టణం ప్యారీ కంపెనీ గేటు వద్ద నివసించే ఓ యువతికి ఇన్‌స్టాగ్రామ్‌లో హైదరాబాద్‌కు చెందిన యువకుడు పరిచయం అయ్యాడు. ఆ యువకుడి ద్వారా మరో యువకుడు పరిచయం కావడంతో అతడిని ప్రేమించింది. ఇదే సమయంలో మొదట పరిచయమైన వ్యక్తిని స్థానికంగా ఉన్న మరో యువతికి పరిచయం చేయడంతో వారిద్దరూ ఇన్‌స్టా గ్రామ్‌లో ప్రేమించుకున్నారు. ఇదిలా ఉండగా ఆ యువతి ఇంట్లో నుంచి వెళ్లిపోవడంతో వారి తల్లిదండ్రులు తాడేపల్లిలో ఇన్‌స్టాగామ్‌లో చురుకుగా ఉండే సదరు యువతిపై తన కూతురు వెళ్లిపోవడానికి కారణం అంటూ గురువారం ఫిర్యాదు చేయడంతో తాడేపల్లి పోలీస్ స్టేషన్‌లో ప్రేమ జంట వ్యవహారంపై ఇరు కుటుంబాల వారు పంచాయితీ నిర్వహిస్తున్నారు.

సేకరించిన వివరాల ప్రకారం తాడేపల్లి ప్యారీ కంపెనీ వద్ద నివాసముండే భవానికి హైదరాబాద్‌కు చెందిన శ్రీకాంత్ ఇన్‌స్టాగామ్‌లో పరిచయమయ్యాడు. శ్రీకాంత్ స్నేహితుడు సతీష్ పరిచయం కావడంతో భవానీ, సతీష్‌లు ఇద్దరూ ఇన్‌స్టా గ్రామ్‌లోనే ప్రేమ వ్యవహారం నడిపారు. ఈక్రమంలోనే మొదట పరిచయమైన శ్రీకాంత్‌కు ప్యారీ కంపెనీ వద్ద నివాసముండే బషీరున్నీసాని భవానీ పరిచయం చేసింది. వీరు నలుగురు ఈ మధ్యకాలంలో విజయవాడ గుణదల మేరి మాత ఆలయం వద్ద కలుసుకున్నారు. ఈనెల 17వ తేదీన బషీరున్నీసా ఇంటి నుంచి వెళ్లిపోయింది. తన కుమార్తె ఎక్కడకు వెళ్లిందో తెలియక వెతుకుతున్న సమయంలో భవానీ ద్వారా శ్రీకాంత్ పరిచయమయ్యాడని, అతనితో వెళ్లిపోయిందని అనుమానం వ్యక్తం చేశారు. సదరు విషయమై భవానీని బషీరున్నీసా తల్లిదండ్రులు ప్రశ్నించగా తనకేమీ తెలియదని సమాధానం చెప్పింది. శ్రీకాంత్‌ను కూడా విచారించగా తనకు తెలియదని చెప్పడంతో జరిగిన సంఘటనపై ఆందోళన చెందిన బషీరున్నీసా తల్లిదండ్రులు మరోసారి భవానీని ప్రశ్నించగా సతీష్, బషీరున్నీసాలతో కలసి హైదరాబాద్ వెళ్లామని, పెళ్లిచేసుకోవాలని భావించామని, సతీష్ కొంతకాలం ఆగుదామని అనడంతో తాను వెనక్కి వచ్చానని, బషీరున్నీసా, శ్రీకాంత్‌లు హైదరాబాద్‌లోనే ఉన్నారని తెలిపింది. దీంతో బషీరున్నీసా తల్లిదండ్రులు శ్రీకాంత్‌కు, కుమార్తెకు ఫోన్ చేయగా ఫోన్ స్విచ్ఛాఫ్ రావడంతో తన కుమార్తెను సతీష్, భవానీలు కిడ్నాప్ చేసి అమ్మేశారంటూ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. జరిగిన ఈ సంఘటనపై తాడేపల్లి పోలీసులు విచారణ చేపట్టారు.

మొక్కలు నాటండి..సంరక్షించండి



మేరీ మట్టి- మేరా దేశ్ కార్యక్రమంలో విద్యార్థులు

మంగళగిరి: కార్పొరేషన్ పరిధిలోని ఆత్మకూరులో ఉన్న నిర్మలా ఫార్మసీ కళాశాలలో గురువారం మేరీ మట్టి- మేరా దేశ్ కార్యక్రమం నిర్వహించారు. కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ఎస్‌కే అబ్దుల్ రెహ్మాన్ మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణలో భాగంగా మొక్కలు నాటి వాటిని సంరక్షించాలన్నారు. కళాశాల కరస్పాండెంట్ సిస్టర్ జి నిర్మల జ్యోతి మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణలో భాగంగా పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, తద్వారా ఆరోగ్యంగా ఉండవచ్చన్నారు. అనంతరం కళాశాల ఆవరణలో విద్యార్థులతో కలసి మొక్కలు నాటారు. కార్యక్రమంలో జాతీయ సేవా పథకం ప్రోగ్రామ్ అధికారి రేఖా నరేష్‌బాబు, ఆర్ నరసింహనాయక్, బీ.ఫార్మసీ ప్రథమ, తృతీయ సంవత్సర విద్యార్థులు పాల్గొన్నారు.

మాదక ద్రవ్యాల వినియోగంపై పోలీసుల దృష్టి

ఐదుగురిపై కేసు నమోదు

తాడేపల్లిరూరల్: తాడేపల్లి పోలీసులు మాదక ద్రవ్యాల వినియోగంపై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేశారు. దీనిలో భాగంగా తాడేపల్లిలో గంజాయి కలిగి ఉన్న నలుగురు యువకులతోపాటు ఓ బాలుడిపై గురువారం కేసు నమోదు చేశారు. కేసు నమోదు చేసిన వారిలో ఒకరు పరారీలో ఉండగా ముగ్గురు యువకులను, మైనర్ బాలుడిని అరెస్ట్ చేసి కోర్టుకు హాజరు పరిచారు. ఎస్ఐ రమేష్ తెలిపిన వివరాల ప్రకారం.. తాడేపల్లి పట్టణానికి చెందిన వల్లెపు చిరంజీవి, బత్తుల సాయిలు తాపీపని చేస్తుండగా, బత్తుల శేషు లారీ మెకానిక్‌గా పనిచేస్తున్నాడు. వీరు ముగ్గురూ మద్యానికి, గంజాయికి అలవాటు పడ్డారు. వీరితోపాటు డిగ్రీ పూర్తిచేసుకున్న అమరారెడ్డి, మరో మైనర్ బాలుడిని కలుపుకుని ఏజన్సీ ఏరియా నుంచి గంజాయి తీసుకువచ్చి దానిని చిన్న చిన్న పొట్లాలుగా మార్చి అమ్ముతున్నారు. సీఐ శేషగిరిరావుకు అందిన సమాచారం మేరకు బత్తుల శేషు, బత్తుల సాయి ఇళ్లలో తనిఖీలు చేయగా వారి వద్ద రెండు కిలోలు, మైనర్ బాలుడి వద్ద అర కిలో, అమరారెడ్డి దగ్గర పావు కిలో గంజాయి లభించింది. ముగ్గురు యువకులతోపాటు మైనర్ బాలుడిని విచారించగా వల్లెపు చిరంజీవి గంజాయి విక్రయాలకు మూల సూత్రధారి అని తెలిసిందని, వీరిపై కేసు నమోదు చేసి కోర్టుకు హాజరుపరిచినట్లు ఎస్ఐ తెలిపారు.

నగరపాలక సంస్థ కార్మికుల శ్రేయస్సే లక్ష్యం

మేయర్ కావటి, కమిషనర్ కీర్తి చేకూరి

నెహ్రూనగర్: నగరపాలక సంస్థలో విధులు నిర్వహించే అవుట్ సోర్సింగ్ కార్మికుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్నామని, ఈఎస్ఐ కార్డ్స్ అప్‌డేషన్ శిబిరాన్ని అవసరమైతే మరో రెండు రోజులు పొడిగించేలా చర్యలు తీసుకుంటామని నగర మేయర్ కావటి మనోహర్‌నాయుడు, నగర కమిషనర్ కీర్తి చేకూరి తెలిపారు. నగరపాలక సంస్థ ప్రధాన కార్యాలయంలో నిర్వహిస్తున్న ఈఎస్ఐ కార్డ్స్ అప్‌డేట్ శిబిరాన్ని గురువారం అదనపు కమిషనర్, డెప్యూటీ కమిషనర్లు, ఎస్ఈలతో కలసి పరిశీలించారు. కార్మికులతో మాట్లాడారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈఎస్ఐ నూతన నిబంధనల మేరకు కార్మికులందరూ తప్పనిసరిగా తమ ఈఎస్ఐ కార్డ్‌ల్ని కుటుంబ సభ్యుల ఆధార్ కార్డ్‌లతో అప్‌డేట్ చేసుకోవాల్సి ఉంటుందని తెలిపారు. శిబిరంలో సమస్యలు లేకుండా నగరపాలక సంస్థ మేనేజర్ పర్యవేక్షణ చేస్తున్నారని పేర్కొన్నారు. ఉద్యోగులతో పాటు కార్మికుల సమస్యల పరిష్కారానికి నగరపాలక సంస్థ అధిక ప్రాధాన్యత ఇస్తోందన్నారు. ఎక్కడాలేని విధంగా అవుట్ సోర్సింగ్ కార్మికులకు ఇన్స్యూరెన్స్ వార్షిక ప్రీమియాన్ని పూర్తిగా నగరపాలక సంస్థే చెల్లిస్తోందని తెలిపారు. పీఎఫ్ ఖాతాలకు సంబంధించి కొందరు కార్మికులు ఫిర్యాదులు చేశారని, వారంతా అర్జీలు అందజేస్తే త్వరలో పరిష్కారానికి తగిన చర్యలు తీసుకుంటామని వెల్లడించారు. కార్యక్రమంలో అదనపు కమిషనర్ పెద్ది రోజా, డెప్యూటీ కమిషనర్లు బి.శ్రీనివాసరావు, సీహెచ్.శ్రీనివాస్, డి.రవీంద్ర, ఎస్.ఈ భాస్కర్, ఎంహెచ్‌వో డాక్టర్ భాను ప్రకాష్, మేనేజర్ శివన్నారాయణ, ఎస్ఎస్‌లు పాల్గొన్నారు.

గుంటూరు వాసి గుళ్లపల్లిలో మృతి

చెరుకుపల్లి: కొంతకాలంగా ఓ ఇంటిలో అద్దెకు ఉంటున్న పెయింటర్ అనారోగ్యంతో గురువారం మృతి చెందాడు. ఈ ఘటన మండలంలోని గుళ్లపల్లి గ్రామంలో చోటుచేసుకుంది. ఎస్సై వై.సురేష్ వివరాల మేరకు.. నరహరి శెట్టి కిషోర్(42) అనే వ్యక్తి ఎనిమిది నెలలుగా గుళ్లపల్లి జెండాచెట్టు సమీపంలోని ఓ ఇంటిలో అద్దెకు ఉంటున్నాడు. కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్నాడు. పట్టించుకునే వారు లేక బుధవారం మధ్యాహ్నం 3 గంటల సమయంలో మృతి చెందాడు. మృతుడు లభించిన ఆధారాల మేరకు.. గుంటూరులోని నాగేశ్వరరావు విధికి చెందిన వ్యక్తిగా గుర్తించారు. తండ్రి రాధాకృష్ణగా సమాచారం. మృతుడి బంధువులు వివరాలు తెలియరాలేదని, ఎవరూ రాకపోవటంతో స్థానిక వీఆర్‌వో రమేష్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు. మృతుడికి సంబంధించిన వారు ఉంటే వివరాలకు 94409 00874, 49907 96166, 08648-247233 నంబర్లకు సంప్రదించాలని తెలిపారు.